
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు
ఆదివారం 4 మే 2025

సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు పెంపు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును మే 5వ తేదీ వరకు పొడిగించినట్లు డీవీఈవో సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమాచారాన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు విద్యార్థులకు తెలపాలని పేర్కొన్నారు.


హంద్రీనీవా కాలువ విస్తరణ పనుల్లో యంత్రాలు

తూములు తవ్వరా..?

కళ్లముందే కృష్ణా జలాలు కదలిపోతున్నాయి. మెట్ట పొలాలకు మళ్లిస్తే కరువునేల సస్యశాలమం అవుతుంది. రైతు ముంగిట ధాన్యరాశులు నిండుతాయి. అదిజరగాలంటే హంద్రీనీవా కాలువకు అవసరమైన ప్రాంతాల్లో తూము (స్లూయిస్)లు ఏర్పాటు చేయాలి. పంట కాలువలు తవ్వి సాగునీరు అందించాలి. అదే జరిగితే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అదనంగా 16,908 ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. భూగర్భజలాలు పెరిగి.. బోరుబావుల కింద సాగు విస్తీర్ణం పెరుగుతుంది. రూ.690 కోట్లతో హంద్రీనీవా కాలువను 3,850 క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పనులతో పాటు 18 గ్రామాల వద్ద కరువు నేలకు సాగునీరు ఇచ్చేందుకు వీలుగా తూములు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా యంత్రాలలో విస్తరణ పనులు చేస్తున్నారు. ఆ తరువాత స్లూయిస్‌లు ఏర్పాటు చేయడం అసాధ్యం. ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి తూములు తవ్వాలి. లేదంటే కరువు రైతులకు మిగిలేది కన్నీళ్లే. అదే క్రమంలో పత్తికొండ జలాశయం స్లూయిస్ విస్తరించకపోవడం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- రూ.690 కోట్లతో హంద్రీనీవా కాలువ విస్తరణ
- జూన్ ఆఖరికి పూర్తి చేయాలని మంత్రి నిమ్మల ఆదేశం
- ఉమ్మడి జిల్లాలో 18 తూములు ఏర్పాటుకు ప్రతిపాదన
- అదనంగా 16,908 ఎకరాలకు సాగునీరు
- పత్తికొండ జలాశయం స్లూయిస్ విస్తరణ అంతేనా..?

కర్నూలు, మే 3 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ కరువు పల్లెసీమల జలప్రదాయిని హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం. శ్రీశైలం డ్యాం ఎగువన 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05లక్షల ఎకరాలకు సాగునీరు, 35లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్నది లక్ష్యం. ఫేజ్-1 నందికొట్కూరు మండలం మాల్యాల ప్రధాన మాల్యాల లిఫ్ట్ 0/0 నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కిలోమీటర్ల మేర కాలువ తవ్వారు. 8 లిఫ్టులు ఏర్పాటు చేశారు. 12 పంపుల ద్వారా 3,850 క్యూసెక్కులు పోసి ఖరీఫ్ సీజన్‌లో 40 టీఎంసీలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం కాలువ 2 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం కూడా లేదు. ఈ లెక్కన 20-25 టీఎంసీలకు మించి తీసుకోలేని పరిస్థితి ఉంది. ఏటా 15-20 టీఎంసీలు నష్టపోవాల్సి వస్తుంది. కృష్ణా నదీ వరద జలాలు కడలి పాలు అవుతున్నా.. కరువు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. పూర్తిస్థాయి వరద జలాలు రాయలసీమ జిల్లాలకు మళ్లించాలనే సంకల్పంతో గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో.. 3,850 క్యూసెక్కుల ప్రవాహానికి విస్తరణ పనులు చేపట్టారు. దాదాపు రూ.285.77 కోట్లు ఖర్చు చేశారు. 2019 మేలో కొలువుదీరిన జగన్ ప్రభుత్వం విస్తరణ పనులకు బ్రేక్ వేసింది. మళ్లీ ఇప్పుడు ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు హంద్రీనీవా విస్తరణ పనులు ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. జూన్ నెలాఖరులోగా ఫేజ్-1 పరిధిలో బ్యాలెన్స్ (మిగులు) పనులు రూ.690 కోట్లతో చేపట్టి చిత్తూరు జిల్లాకు కృష్ణా జలాలు లక్ష్యంగా శరవేగంగా పనులు చేస్తున్నారు.


హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు

29 వేల ఎకరాలకు మించి లేనట్టే

జిల్లాలో హంద్రీనీవా కాలువ ద్వారా పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువ కింద 61,400 ఎకరాలు, కృష్ణగిరి జలాశయం కింద 5,090 ఎకరాలు, కాలువ పొడవున తూములు (స్లూయిస్) ద్వారా 13,500 ఎకరాలు చొప్పున 80 వేల సాగునీరు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం 29 వేల ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వడం లేదు. పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువల అసంపూర్తి పనులు పూర్తిచేస్తే ఆయకట్టుకు సాగునీరు ఇవ్వవచ్చు. ఆ దిశగా చర్యలు శూన్యం. కళ్ల ముందే కృష్ణా జలాలు తరలిపోతుంటే నిత్యం కరువు. వలసలతో తల్లడిల్లే కర్నూలు జిల్లా కరువు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు.

హంద్రీనీవా కాలువకు తూములు ఏర్పాటు డిమాండ్, అదనపు ఆయకట్టు (ఎకరాలు) వివరాలు

తూము ప్రతిపాదన గ్రామం	కిలో మీటరు వద్ద	లబ్ధిపొందే గ్రామాలు	అదనపు ఆయకట్టు (ఎకరాలు)
గార్గేయపురం -2	22.02, 23.23	6	1,015
నాయకల్లు	--	6	500
తొగరచేడు	--	5	700
మల్లికార్జునపల్లె	57.145	1	300
లద్దగిరి	58.90	1	300
నార్లాపురం	61.50	4	1,000
ఎర్రగుడి	67.50	5	2,500
కంబాలపాడు	81.142	1	1,297
కుర్నగిరి	90.104	1	1,875
పెనుమాడ	91.831	2	621
దూదేకొండ	113.615	3	1,200
హోసూరు	123.40	3	1,250
బూరుజుల	130.032	3	750
పెరవలి	134.602	3	600
బొమ్మనపల్లి, హంప	136.755	7	1,500
మద్దికెర	141.375	5	1,500
మొత్తం	--	56	16,908

కొత్త తూములకు ప్రభుత్వ అనుమతి కావాలి

హంద్రీనీవా కాలువ ఫేజ్-1 కింద కర్నూలు జిల్లాలో కాలువ విస్తరణ బ్యాలెన్స్ పనులు రూ.690 కోట్లతో చేపట్టాం. ఇప్పటివరకు 20 శాతం పనులు పూర్తయ్యాయి. విస్తరణలో భాగంగా ఆయా గ్రామాల దగ్గర కొత్తగా తూములు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు, రైతులు కోరుతున్న మాట నిజమే. కొత్త తూములు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ అనుమతి కావాలి. పత్తికొండ జలాశయం ఇన్‌లెట్ స్లూయిస్, అవుట్‌లెట్స్ స్లూయిస్ మధ్య వ్యత్యాసం భారీగా ఉంది. అదనపు ఇన్‌లెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

- నాగరాజు, సీఈ,
హంద్రీనీవా ప్రాజెక్టు, అనంతపురం


పత్తికొండ (పందికోన) జలాశయం

పత్తికొండ రిజర్వాయర్ స్లూయిస్ విస్తరించరా..?

పత్తికొండ (పందికోన) జలాశయానికి నీటిని మళ్లించేందుకు హంద్రీనీవా కాలువకు ఇన్‌లెట్ స్లూయిస్ ఏర్పాటు చేశారు. అలాగే కుడి, ఎడమ కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు రెండు అవుట్‌లెట్స్ స్లూయిస్‌లు ఏర్పాటు చేశారు. అవుట్‌లెట్ స్లూయిస్ కంటే ఇన్‌లెట్ స్లూయిస్ సామర్థ్యం ఎక్కువగా ఉండాలని లేదా సమానంగానైనా ఉండాలని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఇంజనీరింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌లెట్ తూమును 428.72 క్యూసెక్కులు (12.14 క్యూమెక్స్) ప్రవాహ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. జలాశయం నుంచి ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేందుకు కుడి కాలువ అవుట్‌లెట్ తూము 670.98 క్యూసెక్కులు (19 క్యూమెక్స్), ఎడమ కాలువ అవుట్‌లెట్ తూము 141.26 క్యూసెక్కులు (4 క్యూమెక్స్) కలిపి రెండు అవుట్‌లెట్ తూములు 811.24 క్యూసెక్కులు (23 క్యూమెక్స్) సామర్థ్యం ఏర్పాటు చేశారు. అంటే అవుట్‌లెట్ స్లూయిస్ కంటే.. ఇన్‌లెట్ స్లూయిస్ 382.52 క్యూసెక్కులు (10.86 క్యూమెక్స్) తక్కువ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ఇది ఇంజనీరింగ్ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని ఇంజనీర్లు అంటున్నారు. అలాగే వాటర్‌గ్రిడ్‌లో భాగంగా పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో వివిధ గ్రామాలకు తాగునీరు ఇచ్చేందుకు 0.650 టీఎంసీలతో డీపీఆర్ తయారు చేశారు. దీంతో ఇన్‌లెట్ స్లూయిస్ సామర్థ్యాన్ని 25 క్యూమెక్స్ (882.87 క్యూసెక్కులు)లకు పెంచాలని, లేదంటే భవిషత్తులో పత్తికొండ జలాశయం తాగునీరు అందించే ఎస్‌ఎస్ ట్యాంక్‌గా మారే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


పత్తికొండ సమీపంలో చేస్తున్న హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు

18 తూములతో మరో 16,908 ఎకరాలకు సాగునీరు

జిల్లాలో హంద్రీనీవా కాలువ పరిధిలో ప్రస్తుతం కేవలం నాలుగు స్లూయిస్ మాత్రమే ఉన్నాయి. 22.02 కి.మీల నుంచి 141.375 కి.మీల వరకు కాలువ వెంబడి 18 తూములు తవ్వితే.. దాదాపు 56 గ్రామాల్లో 16,908 ఎకరాలకు అదనంగా సాగునీరు ఇవ్వవచ్చు. అంతేకాదు భూగర్భ జలాలు పెరగడం ద్వారా బోరుబావుల కింద సాగు విస్తీర్ణం పెరుగుతుంది. గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు, పాణ్యం, పత్తికొండ ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత, కేఈ శ్యాంబాబులు ప్రభుత్వాన్ని ఒప్పించి తూములు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. విస్తరణ పనులు పూర్తిచేస్తే.. ఆ తరువాత తూములు ఏర్పాటుకు ఏమాత్రం అవకాశం ఉండదు.

‘నీట్’కు సర్వం సిద్ధం

- కర్నూలులో 16 పరీక్షా కేంద్రాలు
- పరీక్షకు హాజరు కానున్న 4,466 మంది
- ఒక నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు

కర్నూలు ఎడ్యుకేషన్ , మే 3(ఆంధ్రజ్యోతి): మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దేశ వ్యాప్తంగా నిర్వహించే ఆఫ్‌లైన్ ప్రవేశ పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) ఆదివారం జరుగనున్నది. ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నీట్ పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష నిర్వహణకు సంబంధించి ఆయా పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు, జిల్లా కో-ఆర్డినేటర్స్, జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. కర్నూలులో 16 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష జరుగనున్నది. ఈపరీక్షకు 4,466 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు జారీఅయ్యాయి. ఒక్కొక్క పరీక్షా కేంద్రంలో 360 మంది ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి కేంద్రంలో సూపరింటెండెంట్‌తో పాటు, వివిధశాఖల అధికారులు పరీక్షా కేంద్రాలను సమన్వయం చేసేందుకు కేటాయింపులు చేశారు. ఎగ్జామ్ సెంటర్లలో ఫ్యాన్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు సంబంధించిన హాల్ టికెట్ నంబర్లను వేశారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. నిర్ణయించిన సమయం కంటే ఒక నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించమని అధికారులు తెలిపారు.



అభ్యర్థులకు సూచనలు

- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆ తర్వాత మెయిన్ గేట్లను మూసివేస్తారు.
- సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. బంగారు ఆభరణాలు, ముక్కుపుడకలు, చేతి గడియారాలు అనుమతించరు.
- పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ నుంచి బయటకు వెళ్లకూడదు. బయోమెట్రిక్ ధ్రువీకరణకు అంతరాయం కలిగించే మెహిందీ చేతులకు వాడరాదు.
- హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీచేసిన ఏదైనా గుర్తింపు కార్డు అభ్యర్థులు వెంట తెచ్చుకోవాలి.

పరీక్షా కేంద్రాలు ఇవే

కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్ (ఏపీఎస్‌పీ క్యాంప్), రాయలసీమ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్(ఆర్‌యూ), ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల(బీ.క్యాంప్), ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాల(గడియారం ఆస్పత్రి), ప్రభుత్వ టౌన్ మోడల్ కాలేజీ (పాత కంట్రోల్‌రూం), ఇందిరాగాంధీ మెమోరియల్ కార్పొరేషన్ హైస్కూల్ (ఏ.క్యాంప్), ఐబీటీడీఎం (దిన్నెదేవరపాడు), క్లస్టర్ యూనివర్సిటీ(సిల్వర్ జూబ్లీ కళాశాల క్యాంపస్) సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల(బీ.క్యాంపు), కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ(రైల్వేస్టేషన్ రోడ్డు), కేంద్రీయ విద్యాలయం(నంద్యాల చెక్‌పోస్టు), మోడల్ స్కూల్(ఐహెచ్‌ఎస్ డీపీ కాలనీ, పెద్దపాడు) ప్రభుత్వ బాలికల ఐటీఐ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ మైనార్టీ కళాశాల(బీ.తాండ్రపాడు)

ఉద్యోగులకు రోజువారీ కనీస వేతన సవరణ

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థలు, కార్యాలయాల్లోనూ సెమీ గవర్నమెంటు విభాగాలు, శాఖల్లో పనిచేస్తున్న క్యాజువల్, కంటింజెంట్, మస్టర్ రోల్ ఉద్యోగులకు చట్ట ప్రకారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రోజువారీ కనీస వేతన సవరణ చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో రోజువారీ కనీస వేతన సవరణకు సంబంధించి వివిధ ఇంజనీరింగ్, ఇతర శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలులో ఉన్న ఉత్తర్వుల మేరకు గతంలో ఉన్న వేతనాలను ఐదు శాతం పెంపు చేస్తూ ఉద్యోగులకు రోజువారీ వేతనాలను పెంచామన్నారు. నైపుణ్యం లేనివారికి రోజుకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.497లు, పట్టణ ప్రాంతాల్లో రూ.573, మున్సిపల్ కార్పొరేషన్లలో రూ.645లుగా వేతనాలను నిర్ధారించామన్నారు. పాక్షిక నైపుణ్యాలు గల వారికి రోజుకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.563లు, పట్టణ ప్రాంతాల్లో రూ.651, మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.728గా వేతనాలను నిర్ధారించామన్నారు. నైపుణ్యం గల వారికి రోజుకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.662, పట్టణ ప్రాంతాల్లో రూ.761, మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.860గా వేతనాలను నిర్ధారించామన్నారు. జిల్లాలో ఉన్న ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు తదితర వృత్తుల్లో పనిచేసే వారి వివరాలు ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ, ఉపాధి కల్పనా శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ సీతాలక్ష్మి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్‌ఈ రాజశేఖర్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్, ఆర్‌అండ్‌బీ ఈఈలు, పంచాయతీరాజ్ శాఖ డీఈ, డీఆర్‌డీఏ ఏపీడీ పాల్గొన్నారు.

‘నీట్’కు పటిష్ఠ భద్రత: ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షల నిర్వహణకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం ఆయన భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో మాట్లాడారు. ఆదివారం జరిగే నీట్ పరీక్షకు 16 పరీక్షా కేంద్రాల వద్ద 210మంది పోలీసులను బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. నీట్ పరీక్షకు మొత్తం 4,466 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందని, ప్రతి కేంద్రానికి ఒక సీఐ లేదా ఎస్‌ఐ స్థాయి పోలీసు అధికారిని నియమించినట్లు తెలిపారు. నీట్ పరీక్షకు వెళ్లే అభ్యర్థులకు ట్రాఫిక్ వల్ల ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్‌షాపులను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ రద్దు

- వెనుదిరిగి వెళ్లిన హెల్త్ అసిస్టెంట్లు

కర్నూలు హస్పిటల్, మే 3(ఆంధ్రజ్యోతి): హెల్త్ అసిస్టెంట్ల (మేలు) పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను రద్దుచేస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ ఆదేశాలు జారీచేశారు. ఎంపీ హెచ్‌ఏ (ఎం)సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకునేందుకు పని సర్దుబాటు చూసే కౌన్సెలింగ్ శనివారం నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం ఉమ్మడి జిల్లాలో కౌన్సెలింగ్ నిర్వహించాలని సీఎఫ్‌డబ్ల్యూ కమిషనర్ వాట్సప్ మేసేజ్‌ను హెల్త్ అసిస్టెంట్లు జీసీ రాముడు, వెంకటస్వామి, అనిల్, సునీల్ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఎంహెచ్‌వో డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్)తో ఫోన్‌లో మాట్లాడారు. డీహెచ్ ఆదేశాల మేరకు ఉద్యోగుల అభ్యంతరాలను పంపించారు. అక్కడి నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కౌన్సెలింగ్ తేదీని ప్రకటిస్తామని డీఎంహెచ్‌వో వెల్లడించారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హెల్త్ అసిస్టెంట్లు వెనుదిరిగారు.

జడ్పీలో పదోన్నతులు

కర్నూలు న్యూసిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న ముగ్గురు రికార్డు అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్.కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న రికార్డు అసిస్టెంట్ వీరశేఖర రాజుకు జడ్పీహెచ్‌ఎస్ బలపనూరు, దేవనకొండ జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న అన్వర్‌కు జూపాడుబంగ్లా మండల పరిషత్ కార్యాలయం, బనగానపల్లె జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న జాకీర్ హుశేన్‌ను కోవెలకుంట్ల మండల పరిషత్ కార్యాలయానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు. అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100కు ఫోన్ చేయవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రత్యేక తరగతులను వినియోగించుకోండి

డీఈవో శామ్యూల్ పాల్

ఓర్వకల్లు, మే 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వ ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో వీధుల గుండా దండోరా వేయించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదిలో ఫెయిలైన విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సబ్జెక్టుల వారీగా చదివిస్తామన్నారు. మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుధ్యం సౌకర్యాలు కల్పించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఎంఈవోలు ఓంకార్ యాదవ్, శ్రీధర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం మద్దిలేటి, గౌరి నందనరెడ్డి, సీఆర్‌పీలు రమణ, కుమార్ పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు • కోడుమూరు • పాణ్యం

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలతో గడిచిన 10 సంవత్సరాలలో 4 లక్షల మందికి పైగా రైతులు, కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. 2020లో తీసుకువచ్చిన నల్లచట్టాలను రైతులు 13 నెలలకు పైగా పోరాడి రద్దు చేయించారన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు పెట్టుబడి సాయం అమలు చేయాలన్నారు. నూతన కౌలు చట్టం, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని కోరుతూ ఈనెల 20న గ్రామా లు, మండలాలలో ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి కే.రామకృష్ణ, సహాయ కార్యదర్శి హనుమంతు, ఉపాధ్యక్షుడు కె.సూరి, నాయకులు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఆర్థిక నేరస్తుడు వైఎస్ జగన్'

కర్నూలు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరస్తుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని, ఆయన కింద పనిచేసే వైసీపీ నాయకులకు సిగ్గుండాలని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సోమిశెట్టి మాట్లాడుతూ అమరావతి కార్యక్రమంపై వైసీపీ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మేయర్ బీవై రామయ్యకు ఆ కుర్చీలో కూర్చునేందుకు సిగ్గు ఉండాలన్నారు. నగర పాలక సర్వసభ్య సమావేశంలో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక వైసీపీ కార్పొరేటర్లతో దాడులకు పాల్పడుతున్నారని, ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు క్రాంతి కుమార్, కురువ పరమేష్, తెలు గు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, వి.హనుమంతరావు చౌదరి, బి.రామాంజనేయులు, ఎస్ పామన్న తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ సమ్మర్ క్యాంపును

వినియోగించుకోండి : సీఐ

కోడుమూరు, మే 3(ఆంధ్రజ్యోతి): జడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహించే వాలీబాల్ సమ్మర్ క్యాంపును బాలబాలికలు వినియోగించుకోవాలని సీఐ తబ్రేజ్ అన్నారు. స్థానిక పోలీస్ సర్కిల్లో శనివారం ఆయన మాట్లాడుతూ పోలీసుల సమక్షంలో మే ఒకటి నుంచి 30వ తేదీ వరకు సమ్మర్ క్యాంపులో భాగంగా 8 సంవత్సరాల నుంచి 18 వయస్సు గల బాలబాలికలకు ఉచితంగా వాలీబాల్ నేర్పించనున్నామని అన్నారు. ఉదయం 6గంటల నుంచి 8.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30గంటల వరకు సమ్మర్ క్యాంపు చేపట్టనున్నామని, ఆసక్తి గల బాలబాలికలు 70931 08115, 6305093345 సెల్ నంబర్లను సంప్రందించాలని సూచించారు.

నీట్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు

కర్నూలు రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథగట్టులో ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాలలో నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఆదివారం కర్నూలు ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచి బస్సులను ఏర్పాటు చేసినట్లు కర్నూలు-2 ఇన్‌చార్జి డిపో మేనేజర్ ఎల్ దీప్తి సుజన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు కర్నూలు సబస్ స్టేషన్ నుంచి ఉదయం 10:30, 11:15, 11:45 గంటలకు మధ్యాహ్నం 12:15 గంటలకు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే పరీక్ష అనంతరం కూడా జగన్నాథగట్టు ట్రిపుల్ ఐటీ కళాశాల నుంచి సాయంత్రం 5 గంటలకు 4 బస్సులు కొత్తబస్టాండు వరకు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

డ్రోన్ వినియోగం అధికం: కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 3(ఆంధ్రజ్యోతి): పలు రంగాల్లో డ్రోన్ వినియోగం అధికంగా జరుగుతుందని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. శనివారం స్థానిక నందికొట్కూరు రోడ్డులోని రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్స్‌కు సంబంధించిన ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఉన్నతమైన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్ వినియోగంపై ట్రిపుల్ ఐటీ అధ్యాపకులతో శిక్షణ నిర్వహించారన్నారు. డ్రోన్ ఆపరేటివ్‌పై శిక్షణ పొందిన విద్యార్థులతో డ్రోన్ ఫ్లయింగ్ గురించి వాటి పనితీరు గురించి ప్రత్యక్షంగా కలెక్టర్ పరిశీలించారు. రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధినేత గూడూరు పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ కేఈ శ్రీనివాసమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

కర్నూలు హాస్పిటల్: శ్రీశైలం దర్శనాంతరం తిరిగి వస్తూ నంద్యాల జిల్లా బైర్లూటి సమీపంలో ప్రమాదానికి గురై గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. శనివారం ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థో విభాగంలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. పురుషుల, స్త్రీల వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన చికిత్స అందించాలని హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లును కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సిందూ సుబ్రహ్మణ్యం, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి రంగ స్వామి ఉన్నారు.

కార్డియాలజీలో నూతన బెడ్లను ప్రారంభించిన కలెక్టర్

కర్నూలు సర్వజన ఆసుపత్రి కార్డియాలజీ విభాగంలో నూతనంగా ఏర్పాటుచేసిన 30బెడ్లను కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ప్రారంభించారు. ఫేస్‌మేకర్ వేయించుకున్న రోగులు, గుండె సంబంధిత చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి కలెక్టర్ పరామర్శించారు. అనంతరం కార్డియాలజి విభాగం క్యాత్‌లాబ్‌లో జరుగుతున్న యాంజియోగ్రామ్ సర్జరీని కలెక్టర్ ప్రత్యక్షంగా వీక్షించారు. సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ పాల్గొన్నారు.

యువత పోరాటాలకు సిద్ధం కావాలి

- జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు
- ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు న్యూసిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన వహించగా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. మునెప్ప జెండాను ఆవిష్కరించారు. లెనిన్‌బాబు మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాటను గాలికి వదిలేశారన్నారు. అంబానీ, అదానీలకు దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. కార్యక్రమంలో మాజీ నాయకులు రామకృష్ణారెడ్డి, రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్, ఏఐటీయూసీ నగరకార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాహుల్ కృషి వల్లే కులగణన



రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): జాతీయ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఒత్తిడితోనే కేంద్రం కులగణన ప్రకటన చేసిందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టిన విషయాన్ని రాహుల్ పార్లమెంట్‌లో ప్రస్తావించడం, ఆపై కేంద్రంలో కదలిక వచ్చి నిర్ణయం తీసుకుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకత్వం వినిపించిన వాదనకు దిగి వచ్చిన కేంద్రం తన నిర్ణయాన్ని ప్రకటిం చిందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ. బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌సీ బజారన్న, ఎస్ ప్రమీల, షేక్ ఖాజా హుస్సేన్, షేక్ రియాజ్ పాల్గొన్నారు.

పందులను నగరానికి దూరంగా ఉంచాలి

కర్నూలు న్యూసిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): పందులను నగరానికి 5 కి.మి. దూరంలో ఉంచాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్..రవీంద్రబాబు పందుల పెంపకందారులకు సూచించారు. శనివారం కౌన్సిల్ హాలులో పందుల పెంపకందారులతో జిల్లా మానిటరింగ్ కమిటీ కన్వీనర్ల తొలి సమావేశం కమిషనర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ నగరంలో పందులను పోషించడం వల్ల పర్యావరణానికి హాని చేస్తున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నగరానికి దూరంగా పందులను ఉంచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు, ప్రభుత్వం మార్గదర్శకాలను అమలు చేసేందుకు కలెక్టర్ జిల్లా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ పరిధిలో సర్వే నెంబరు 363, 552లో 4.15 ఎకరాల స్థలం కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పశుసంవర్ధక శాఖ జేడీ జే.శ్రీనివాస్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కర్, మెప్మా పీడీ నాగశివలీల, డీఎల్‌పీఓ టి.లక్ష్మి, రూరల్ తహసీల్దారు రమేష్ బాబు, ఆదోని, ఎమ్మిగనూరు కమిషనర్లు ఎం.కృష్ణ, ఎన్.గంధిరెడ్డి, గూడూరు నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు, నగర పాలక ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

కోడుమూరు రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తి గ్రామంలో సాయిబాబా పండుగ సందర్భంగా శనివారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలను ఆర్గనైజర్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. తాండ్రపాడుకు చెందిన వరలక్ష్మి ఎద్దులు 4,286 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. తర్వాత స్థానాల్లో వెంకటగిరి బీఎల్‌కే బుల్స్, ఈడిగోనిపల్లె వంశీకృష్ణ, మిడుతూరు సాయివర్ధన్ ఉత్తనూరు నరేష్ ఎద్దులు, కొణిదెల గ్రామానికి చెందిన దండు రైడర్స్ నిలిచాయి. విజేతలకు వరుసగా దాతలు శ్రీనాథరెడ్డి రూ.30 వేలు, సుధాకర్‌రెడ్డి రూ.25 వేలు, రంగారెడ్డి రూ.20 వేలు, హర్షవర్ధన్‌రెడ్డి రూ.15 వేలు, బోయ సురేష్, బోయ సురేంద్ర రూ.10 వేలు అందజేశారు.

విద్యార్థుల హక్కుల కోసం పోరాటం



మాట్లాడుతున్న పీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు రాజు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కుల కోసం పోరాడాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బిర్లా కాంపౌండులో ఉన్న కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకుండా వేలకు వేల రూపాయలు ఫీజుల రూపంలో దండుకుంటున్నారని ఆరోపించారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు లేక అస్తవ్యస్తంగా తయారైందన్నారు. అనంతరం పీఎస్‌ఏ నూతన జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దయ్య, మారుతి, రంగస్వామి, హుశేన్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

- 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- 120 లీటర్ల సారా స్వాధీనం

కర్నూలు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లోని నాటు స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. శనివారం ఉదయం అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖరగౌడ్ ఆధ్వర్యంలో బంగారుపేటలో దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 120 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నాటుసారాతో నీలిషికారి రాజమ్మ, నీలిషికారి రోజా, బంగారుపేట నీలిషికారి భారతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ చంద్రహాస్ మాట్లాడుతూ బెల్లం దిగుమతి చేస్తున్న వారి వివరాలను భారతి ఇచ్చిన ప్రకారం నందికొట్కూరుకు చెందిన నారాయణపై కేసు నమోదు చేశామని, 10 లీటర్ల నాటుసారాతో కలిగి ఉన్న ఓర్వకల్లుకు చెందిన శారద అనే మహిళను కూడా అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌టీఎఫ్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు రెహనా, రవితేజ, సిబ్బంది చంద్రపాల్, రామలింగయ్య, మధు, లక్ష్మీబాయ్, సువర్ణమ్మ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలుగు సారస్వత వైభవం సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య గుబ్బా బాల స్వామి రచించిన 'దేవుడా...' శతకం పుస్తక ఆవిష్కరణ ఏర్పాటు చేసినట్లు నిర్వాహక సంస్థ అధ్యక్షుడు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల నిరసన

కర్నూలు హస్పిటల్, మే 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా యూనిట్‌గానే పని సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ జిల్లాకు చెందిన 40 మంది హెల్త్ అసిస్టెంటు (మేల్) డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉలిందకొండ హెల్త్ అసిస్టెంట్ నాగన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాల యూనిట్లుగా చేసుకుని కౌన్సెలింగ్ నిర్వహించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. 15 రోజుల క్రితం నంద్యాల జిల్లాలో కౌన్సెలింగ్ జరిగిందని, వారికి అపాయింట్ మెంట్ ఆర్డర్స్ ఇచ్చారని, విధుల్లో కూడాచేరారని తెలిపారు. కౌన్సెలింగ్ ఉందని అధికారులు మెయిల్ ద్వారా పంపితే జిల్లా నలుమూలల నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చామన్నారు. తీరా డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ కౌన్సెలింగ్ అనేది ఉమ్మడి జిల్లాలో జరుగుతుందని, తేదీ ప్రకటిస్తామని చెప్పారు. కర్నూలు జిల్లా యూనిట్‌గానే కౌన్సిలింగ్ జరపాలని కొన్ని పీహెచ్‌సీల్లో మలేరియా, డెంగీ కేసులు లేవంటూ పోస్టింగ్‌లు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. ఒక వేళ డెంగీ కేసులు ఆ పీహెచ్‌సీల్లో వస్తే అక్కడ ఎవరు సేవలు అందించాలని అడిగారు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలో ఎక్కువ పోస్టింగ్‌లు చూపించారని, మారుమూల గ్రామాల ప్రాంతాలైన పత్తికొండ, అలూరు. చిప్పగిరి, తుగ్గలి, మద్దికెరల్లో పోస్టులు ఎందుకు చూపించలేదని మండి పడ్డారు. అనంతరం డీఎంహెచ్‌వోకు హెల్త్ అసిస్టెంట్లు వినతిపత్రం సమర్పించారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గూడూరు, మే 3(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సంచార చికిత్స కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. శనివారం మండలంలోని పొన్నకల్ గ్రామం లోని అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న కిషోరి వికాస కార్యక్ర మానికి డాక్టర్ రఘు హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలతో ప్రసూతి, శిశు మరణాలు పెరుగుతా యన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుహాసిని, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

నేడు ఆవోపా కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కర్నూలు కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) కర్నూలు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఉంటుందని ఆ సంస్థ మీడియా ఇన్‌చార్జి పార్థసారధి తెలిపారు. నగరంలో సుంకేసుల రోడ్డులోని ఆవోపా సేవా సదన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, గౌరవ అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, ఆహ్వాన అతిథులుగా ఆవోపా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పువ్వాడి చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు, జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు సుబ్రహ్మణ్యం హాజరవుతారని తెలిపారు. ఎంవీ సురేష్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో 2025-2027 సంవత్సరానికి ఎన్నికైన ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన పేర్కొన్నారు.

నేడు రంగస్థలం పోటీలకు ఎంపిక

కర్నూలు కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో రంగస్థలం పోటీలకు అభ్యర్థుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ ఎంపికలు ఉంటాయని, అభ్యర్థులు 16 నుంచీ 35 ఏళ్ల వయసు గల యువతీ యువకులై ఉండి, నటనపై ఆసక్తిగల వారు ఈ ఎంపికకు హాజరు కావచ్చని ఆయన సూచించారు. అభ్యర్థులు కనీస విద్యార్హత పదోతరగతి పాసై ఉండి, బయోడేటా పత్రం, ఆధార్ జిరాక్స్ ప్రతి, ఒక కలర్ ఫొటోతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సోమవారం నుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణలు ఉంటాయని తెలిపారు. శిక్షణల అనంతరం మే 16న అభ్యర్థులతో నాటక ప్రదర్శనలు టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తామని, ఈ శిక్షణలు 'నా బంగారు తల్లి' చిత్ర సహాయ దర్శకుడు జల్లు కుమార్ ఆధ్వర్యంలో ఉంటాయని పత్తి ఓబులయ్య తెలిపారు.

నేడు చిత్రపటాల ఆవిష్కరణ, కళాకారుల సదస్సు

కర్నూలు కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన రంగస్థల కళాకారుల చిత్రపటాల ఆవిష్కరణ, కళాకారులు సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని మద్దూరు నగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో జరిగే ఈ కార్యక్రమంలో రంగ స్థల కళాకారులు లొద్దిపల్లి అల్లాబకాష్, బీసీ కృష్ణ, శ్రీనివాసులు చిత్రపటాలను పింగళి సూరన తెలుగు తోటలో ఆవిష్కరిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సర్వసభ సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

13 నుంచి రాష్ట్రస్థాయి ఉషూ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో స్థానిక బి.క్యాంపులోని టీజీ లక్ష్మి వెంకటేష్ కల్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఉషూ పోటీలకు సంబంధించిన లోగోను మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఒలింపిక్ సంఘం అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, తైక్వాండో జిల్లా సంఘం ప్రతినిధులు సతీష్ కుమార్ వీరేష్‌బాబు, మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీకి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

కర్నూలు కలెక్టరేట్, మే 3(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఎడ్ అభ్యర్థులకు సూచించారు. శనివారం కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు సహకారంతో జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ-2025 సెకండరీ గ్రేడ్ టీచర్ అభ్యర్థులకు వైఈఎస్ పబ్లికేషన్స్ ద్వారా యూట్యూబ్‌లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణా తరగతుల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులను డీఎడ్ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక డీఎస్సీ ప్రకటన విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ అభ్యర్థులు ఆన్‌లైన్ శిక్షణ కోసం ఫోన్.నెంబర్.9292207601కు వాట్సాప్ ద్వారా తమ పేరు అడ్రస్ వివరాలు తెలుపుతూ ఆధార్ కార్డు, డీఎడ్ సర్టిఫికెట్ కాపీలను పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డీఈవో శామ్యూల్‌పాల్ మాట్లాడుతూ నిరుద్యోగ టీచర్ అభ్యర్థులకు ఇది మంచి అవకాశమని అన్నారు.

'అమరావతి అభివృద్ధి ఓర్వలేకే అంబటి వ్యాఖ్యలు'

కర్నూలు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): అమరావతి అభివృద్ధిని ఓర్వలేక రాజధానిపై అంబటి రాంబాబు లాంటి వాళ్ల మరోసారి విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర ధ్వజమెత్తారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాజధాని అద్భుతంగా నిర్మాణం అవ్వబోతోంది. గతంలోనూ గ్రాఫిక్స్ అంటూ విషప్ర చారం చేసి అభివృద్ధిని అడ్డుకోవాలని చూశారు. రూ.54 వేల కోట్లతో నిన్న ప్రారంభించిన పనులు అంబటి రాంబాబుకు కనపడలేదా..? అని ప్రశ్నించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో మోసం.. రూ.54 లక్షలు స్వాహా

కర్నూలు క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటరమణ కాలనీకి చెందిన సుదీంద్రరావు అనే వ్యక్తి నుంచి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.54 లక్షలు స్వాహా చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుదీంద్రరావు 20 ఏళ్ల కిందట పంచాయతీరాజ్ డిపార్టుమెంటులో డీఈగా పని చేసి రిటైర్డు అయ్యారు. గత ఏడాది డిసెంబరు నెలలో బజాజ్ అవంతిక పేరుతో ఉన్న ఆన్‌లైన్ ట్రేడింగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న సమాచారం ఆధారంగా విడతల వారీగా రూ.54 లక్షలు డిపాజిట్ చేశాడు. ఆ కంపెనీ సిబ్బంది ఓ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించారు. నెల కింద సుదీంద్ర రావు అకౌంటులో రూ.9.50 కోట్లు జమ అయిందని ఆన్‌లైన్ ద్వారా చూపించారు. ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవా లంటే రూ.2.5 కోట్లు చెల్లించాలని, ఆ మొత్తాన్ని చెల్లించిన వెంటనే రూ.9.50 కోట్లు విత్‌డ్రా చేసుకోవచ్చని నమ్మించారు. దీంతో సుదీంద్రరావు ఆ కంపెనీ సిబ్బందిని నిలదీశాడు. తాను పెట్టిన పెట్టుబడిని వెనక్కి ఇవ్వాలని నిలదీశాడు. దీంతో ఆ కంపెనీ సిబ్బంది ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకున్నారు. మోసపోయానని గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

లిఫ్టు గుంతలో పడి వృద్ధుడి మృతి

కర్నూలు క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శకుంతలా కల్యాణ మండపం వెనుకాల ఉన్న బాలాజీ నగర్‌లో లిఫ్టు గుంతలో పడి కృష్ణమూర్తి (69) అనే వృద్ధుడు మృతి చెందాడు. కృష్ణమూర్తి తన అపార్టుమెంటులో నాలుగో ఫ్లోర్‌లో నివాసముంటున్నాడు. కింది రెండు ఫ్లోర్లు భరత్ హాస్పిటల్ పేరుతో నడుపుతున్నాడు. ఇంట్లో నుంచి లిఫ్టులోకి వచ్చి బయటకు వెళ్తున్నానని చెప్పాడు. తిరిగి ఎంత సేపటికి ఇంటికి రాకపోయేసరికి అనుమానం వచ్చి లిఫ్టు గుంతలో చూశాడు. లిఫ్టు గుంతలో కృష్ణమూర్తి తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం


పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ఆదోనికి తరలిస్తున్న దృశ్యం

- పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి
- ఐదు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

ఆత్మకూరు, మే 3(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురం చెరువుకట్ట సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం డ్రైవర్ అజాగ్రత్త వల్లే జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈమేరకు శనివారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, అర్బన్ సీఐ రాము సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేయగా పలు వాస్తవాలు వెలుగు చూశాయి. ఆదోని పట్టణంలోని రాయచోటి సుబ్బయ్యనగర్, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్‌తో పాటు గోనెగండ్ల మండలంలోని ఎర్రపాడు గ్రామానికి చెందిన సుమారు 25 మంది బంధుమిత్రులు గురువారమే శ్రీశైలానికి బొలెరో ట్రాలీ వాహనంలో బయలుదేరి వెళ్లారు. శుక్రవారం స్వామిఅమ్మవార్ల దర్శనం పూర్తిచేసుకుని మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే మార్గమధ్యలోని నల్లమల అటవీ ప్రాంతంలో వర్షం కురవడంతో ట్రాలీలో ఎగువ భాగంలో చెక్క పలకలపై కూర్చున్న వారు తమ వెంట తెచ్చుకున్న టార్పాలిన్ కవర్‌ను కప్పేసుకున్నారు. ఈక్రమంలోనే టార్పాలిన్ కప్పేసుకోవడంతో సరిగ్గా ఊపిరి ఆడకపోవడంతో కొంతమంది ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ పరిస్థితుల్లో బైర్లూటి చెక్‌పోస్టు రాగానే వాహనాన్ని నిలిపివేసి ట్రాలీ వాహనంలో ప్రయాణిస్తున్న వారందరు కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఒక కిమీ వ్యవధిలోనే అతివేగంతో బొలెరో ట్రాలీ వెళ్లి సడెన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కుడివైపున బోల్తాపడింది. ట్రాలీలో చెక్కలపై పైభాగాన కూర్చున్నవారు కింద పడిపోగా వారిపై వాహనం పల్టీ కొట్టి తిరిగి యథాస్థితిలో నిలిచినట్లు గుర్తించారు. ఈప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా మరో 15మందికి గాయాలయ్యాయి. ఓవైపు చిరుజల్లులతో కూడిన వర్షం వల్ల రోడ్డు చిత్తడిగా మారి వాహనం అదుపు తప్పే అవకాశం ఉన్నప్పటికీ వాహనాన్ని డ్రైవర్ అతివేగంతో నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులతో ఆరాతీశారు. రోడ్డు ప్రమాదం నేపథ్యంలో శ్రీశైలానికి వెళ్లే వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిని ఆర్టీసీ బస్సులో పంపించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలకు పోలీసులు జరిమానా విధించారు.

పోస్టుమార్టం పూర్తి: ఘోర దుర్ఘటనలో గిడ్డయ్య (42), శశికళ (40), లక్ష్మీ (28) అక్కడికక్కడే మృతిచెందారు. చంద్రమ్మ(31) తీవ్ర గాయాలపాలై ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. అదేవిధంగా కుమార్ (17) కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ఆత్మకూరులోని నలుగురి మృతదేహాలకు ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నారాయణరెడ్డి నేతృత్వంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అదేవిధంగా కర్నూలులో మృతిచెందిన కుమార్ మృతదేహానికి నందికొట్కూరు ఎస్ఐ చంద్రశేఖర్ పర్యవేక్షణలో అక్కడి వైద్యులు పోస్టుమార్టం చేసి, బంధువులకు మృతదేహాలను అప్పగించారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

ఆత్మకూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య


కురవ కుమార్ (ఫైల్)

గోనెగండ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం సిద్ధాపురం చెరువు దగ్గర శుక్రవారం జరిగి రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య శనివారం ఐదుకు చేరింది. రోడ్డు ప్రమాద ఘటనలో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతూ గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన కురువ కుమార్(15) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. దీంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య ఐదుకు చేరింది. వివరాలివీ.. ఎర్రబాడు గ్రామానికి చెందిన సునీల్, సునీత దంపతులు ఇద్దరు కుమారులు. సునిల్ ట్రాలీ వాహనం నడుపుతూ జీవనం సాగించేవాడు. పెద్ద కుమారుడు కుమార్ సున్నిపెంటలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఇటీవల పరీక్షల ఫలితాలు వెలువడటంతో ఫలితాలలో కుమార్ 514 మార్కులు సాధించాడు. ఆదోనికి చెందిన పరిచయస్థులు సునీల్ వాహనాన్ని శ్రీశైలానికి వెళ్లేందుకు బాడుగకు మాట్లాడుకున్నారు. సునీల్ తన కుమారుడు కుమార్ పదిలో మంచి మార్కులు సాధించిన సందర్భంగా తన వాహనంలో శ్రీశైలానికి తీసుకువెళ్లాడు. శ్రీశైలంలో దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో శుక్రవారం సిద్దాపురం చెరువు దగ్గర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ సంఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా మరో 14మందికి తీవ్రగాయాలు అయ్యాయి. గాయాలపాలైన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమార్ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుమార్ మృతదేహాన్ని శనివారం ఎర్రబాడు గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉర్దూ మీడియం ఎస్‌జీటీ కోసం శిక్షణ

కర్నూలు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఎస్‌జీటీ ఉర్దూ మీడియం అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని రీజనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆఫ్ మైనార్టీస్ (ఆర్‌సీడీఎం) డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా కళాశాలలో నిర్వహించే ఈశిక్షణ పై ఆసక్తి ఉన్నవారు ఈనెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మే 8నుంచి కళాశా లలో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణకు ముస్లింలు, క్రైస్తవులు(బీసీ-సీ), సిక్కులు, బౌద్దులు, జైనులు, పార్సీలు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. డీఎస్సీ -2025 ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, టీఈటీ క్వాలిఫై, ఆధార్, ఎస్సెస్సీ, ఇంటర్ జిరాక్స్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం జిరాక్స్‌తో పాటు రెండు పాస్ పోర్టు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు సెల్‌నెంబర్: 9441761178, 9849896996కు సంప్రదించాలన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతకు సిద్ధం: ఎమ్మెల్యే



నంద్యాల మున్సిపాలిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): అహోబిలంలో అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు తాను సిద్ధమని, మీరు సిద్ధమా అంటూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. శనివారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అహోబిలంలో తాను అక్రమాలకు పాల్పడుతున్నట్లు వైసీపీ అనుకూల మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన తప్పులను నిరూపిస్తే రాజీనామా చేసేందుకు తాను సిద్ధమన్నారు. గంగుల ప్రతాప్‌రెడ్డి గత ఎన్నికల్లో వైసీపీ మద్దతు ఇవ్వలేదన్న దురుద్దేశంతో తప్పుడు కథనాలు ప్రచురిస్తూ అందుకు తమను బాధ్యుల్ని చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలు మానుకోవాలని వైసీపీ నాయకులకు ఆమె హితవు పలికారు. ఈ సమావేశంలో తెలుగు గంగ సాగు నీటి సంఘం చైర్మన్ సంజీవ కుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

కబళించిన రోడ్డు ప్రమాదం


ప్రమాద స్థలంలో పడిన మృతదేహాలు

- ఐదు నిమిషాల్లో గమ్యస్థానం..
- ఇంతలో మృత్యు ఒడిలోకి
- ఎర్రకోటలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన గూడ్స్ వాహనం
- ఇద్దరు యువకుల దుర్మరణం

ఎమ్మిగనూరు రూరల్/ఎమ్మిగనూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): కంటెన్నగారి కేశన్న జీవనాధారం వ్యవసాయం. ఎమ్మిగనూరు పశువుల సంతకు వారం వారం వెళ్తుంటాడు. అదే సంతలో ఎద్దుల కొమ్ములు చెక్కేడం (నునుపు చేయడం) కోసం బుక్కరాయసముద్రానికి చెందిన రజాక్ వస్తుంటాడు. ఆ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆదివారం సంత కోసం శనివారమే రజాక్ ఎమ్మిగనూరుకు వచ్చాడు. కేశన్నను కలవడంతో మా ఊరు కడిమెట్లకు వెళ్లివద్దాం రా..! అంటూ ఇద్దరు మోటర్‌బైక్‌పై కడిమెట్లకు బయలుదేరి ఎర్రకోట సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. మరో ఐదారు నిమిషాలు ఉంటే గమ్యస్థానికి చేరుకొని ఉండేవారు. ఇంతలో ఘోరం జరిగిపోయింది. కర్నూలు వైపు నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న సరుకులు రవాణా చేసే ఆశోక్ లైలాండ్ మినీ వాహనం వారు వెళ్తున్న మోటర్ బైక్‌ను ఢీకొట్టడడంతో ఇద్దరు మిత్రులు దుర్మరణం పాలయ్యారు. బోయ కేశన్న(32), రజాక్(35) విగతజీవులుగా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. రాజక్ తల తెగిపోయి దూరంగా పడిపోయింది.

ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామానికి చెందిన కుంటెన్నగారి కేశన్న వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పది ఎకరాల పొలం ఉంది. కేశన్నకు భార్య శారద, కూతుళ్లు అమృత (9ఏళ్లు), అంకిత (7ఏళ్లు), కుమారుడు హరికృష్ణ (6ఏళ్లు) సంతానం. కేశన్నకు జత కాడెద్దులు ఉన్నాయి. ఎద్దుల ద్వారా పొలంలో సేద్యం పనులు చూస్తూనే.. ఖాళీ సమయంలో ఇతర రైతుల పొలాలకు దుక్కుల కోసం బాడుగకు వెళ్తతూ జీవనం సాగిస్తున్నారు. శనివారం కేశన్న ఎమ్మిగనూరుకు వెళ్లాడు. అదే సమయంలో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన రజాక్ ఆదివారం పశుల సంతలో ఎద్దుల కొమ్ములు చెక్కేందుకు వచ్చారు. ఆ పనే ఆయనకు జీవనాధారం. వారం వారం వస్తుండడంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతోనే రజాక్‌ను తన మోటర్‌బైక్‌పై ఎక్కించుకొని కడిమెట్లకు బయలుదేరారు. ఎర్రకోట గ్రామ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కడిమెట్లకు మూడు నాలుగు కిలోమీటర్లు కూడా లేదు. నాలుగైదు నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకునే వారు. ఇంతలో కర్నూలు నుంచి ఎమ్మిగనూరు పట్టణానికి మద్యం లోడ్‌తో వస్తున్న సరుకుల రవాణా చేసే ఏపీ39 యూ 4952 నంబరు గల అశోక్ లైలాండ్ మినీ వాహనం కేశన్న, రజాక్ వెళ్తున్న ఏపీ04 ఏవీ 1388 నంబరు గల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. కనురెప్పపాటులో ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. వాహనాలు బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఎనుక కూర్చున్న రజాక్ తల తెగిపడి మొండానికి దూరంగా పడిపోయింది. కేశన్న రక్తపు మడుగులో అక్కడే కుప్పకూలి మృతి చెందారు. విషయం తెలియగానే కేశన్న భార్య పిల్లలు, బంధువులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహం చూసి కన్నీరుమున్నీరై విలపించారు. తండ్రిని ఆస్థితిలో చూసిన చిన్నారులు రోధిస్తుంటే అయ్యో.. పాపం..! దేవుడా... ఎంత అన్యాయం చేశావయ్యా... అంటూ అక్కడివారు కంటితడి పెట్టారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చెత్తకుప్పలో శిశువు మృతదేహం

కోడుమూరు, మే 3(ఆంధ్రజ్యోతి): చెత్తకుప్పలో చిన్నారి మృతదేహాన్ని పడేసిన హృదయ విదారక ఘటన కోడుమూరులో చోటుచేసుకుంది. పట్టణంలోని సంత మార్కెట్‌లోని ప్రాథమిక పాఠశాల సమీపంలో నెలలు నిండని మగ మృత శిశువును చెత్తకుప్పలో పడేశారు. శనివారం సంత కావడంతో ఆశిశువును చూసేందుకు జనం బారులు దీరారు. మృత శిశువును ఖననం చేకుండా ఇలా చెత్తకుప్పలో వేయడంపై ప్రజలు విమర్శలు కురిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలి చేరుకొని మృత శిశువును స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పంచానామా చేయించి మృత శిశువును ఖననం చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

గడ్డివామి పడి బాలుడి మృతి

తుగ్గలి, మే 3 (ఆంధ్రజ్యోతి): పశువులకు మేత వేసేందుకు వెళ్లి గడ్డివామి మీద పడటంతో బాలుడు రమేష్ (13) శనివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు.. మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు, సరస్వతి దంపతుల కుమారుడు రమేష్ పెండేకల్ ఆర్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. కల్లంలో పశువులకు మేత వేసేందుకు గడ్డిని తీస్తుండగా గడ్డివామి మీదపడి, శ్వాస ఆడక పడిపోయాడు. తల్లిదండ్రులు గడ్డివామి వద్దకు వెళ్లి చూడగా బాలుడు కనిపిచలేదు. గడ్డిని తొలగించి చూసేసరికి అప్పటికే విగతజీవిగా పడిఉన్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, రాంపల్లి శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లక్ష్మీపురంలో చైన్ స్నాచింగ్

లాక్కుని పరారైన ఆటో డ్రైవర్

కర్నూలు క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళ మెడలో ఉన్న గొలుసును చోరీచేసి, ఆమెను ఆటోలో నుంచి తోసేసి ఓ ఆటో డ్రైవర్ పరారైన ఘటన లక్ష్మీపురం సమీపంలో చోటుచేసుకున్నట్లు ఉలిందకొండ పోలీసులు తెలిపారు. వివరాలు.. స్థానిక బిర్లాగేటు ప్రాంతానికి చెందిన మాలతి అనే మహిళ ఉద్యోగం కోసం జగన్నాథగట్టు సమీపంలో ఉన్న రిడ్జ్ స్కూలుకు వెళ్లాలని బిర్లాగేటు వద్ద ఆటో ఎక్కింది. లక్ష్మీపురం సమీపంలో ఆటోడ్రైవర్ ఆమె ఒంటరిగా వచ్చిందని గుర్తించాడు. ఆమె మెడలో గొలుసు లాక్కుని ఆమెను ఆటోలో నుంచి తోసేసి పరారయ్యాడు. బాధితురాలుకు ఏంచేయాలో అర్థంకాక తమ బంధువులకు సమాచారమిచ్చింది. వారు అక్కడికి చేరుకొని ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. అపహరణకు గురైన గొలుసు బరువు రెండున్నర తులాలు ఉంటుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

పెద్దగుండంలో విద్యార్థి గల్లంతు

బేతంచెర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఉన్న పెద్దగుండంలో శనివారం ఈతకు వెళ్లి జాలకంటి మణిధర్(14) అనే విద్యార్థి గల్లంతయ్యాడు. అంబాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు, పుల్లమ్మ దంపతుల కుమారుడు మణిధర్ జూపాడుబంగ్లా ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో గ్రామానికి వచ్చిన మణిధర్ తమ బంధువులు మద్దిలేటిస్వామి కార్యక్రమానికి తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యాడు. అయితే స్నానానికి శనివారం ఉదయం తన బంధువులు, పిల్లలతో కలిసి స్నానం చేసేందుకు పెద్దగుండం దగ్గరకు వెళ్లాడు. మణిధర్‌తో పాటు స్నానానికి వెళ్లిన పిల్లలు తిరిగి వచ్చారు. మణిధర్ రాకపోవడంతో పెద్దగుండంలో గల్లంతైనట్లు తోటి వారు చెప్పడంతో గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు


కాలిపోయిన ఇళ్లు

- ఇంట్లోని పట్టుచీరలు, 8 తులాల బంగారు, 20 తులాల వెండి అగ్గిపాలు

రుద్రవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో శుక్రవారం రాత్రి ఒక్కసారిగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. బాధితుడు పూజారి విశ్వనాథశర్మ తెలిపిన వివరాలివీ.. కుటుంబ సభ్యులంతా కింది పోర్షన్‌లో ఉండగా మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులో ఉన్న బీరువాలో ఉన్న వంద పట్టుచీరలు, 8 తులాల బంగారం, 20 తులాల వెండి ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. కుటుంబ సభ్యులమంతా కింద ఉండడంతో ప్రాణ నష్టం జరగకుండా తప్పింది. గృహమంతా కాలిబూడిదైందన్నారు. అగ్ని ప్రమాదంలో కష్టపడి కూటబెట్టుకున్న సొమ్ములు కాలిబూడిదయ్యాయన్నారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు. ఆళ్లగడ్డ గ్నిమాపక దళ సిబ్బంది గ్రామాన్ని చేరుకుని మంటలు అదుపు చేసింది. ప్రమాదం తృటిలో తప్పింది. భవనమంతా కాలిపోయి పొగ బట్టింది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.20లక్షలు ఆస్తినష్టం సంభవించించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

- రూ.70 లక్షల ఆస్తి నష్టం

డోన్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంబలపాడు సర్కిల్ సమీపంలో ఉన్న గురు రాఘవేంద్ర ఎలక్ట్రానిక్ షాపులో ఉదయం 4 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్‌తో రూ.70 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు. శనివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలు ఆర్పేందుకు 6గంటల పాటు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ బాలరాజు, డోన్ ఫైర్ ఆఫీసర్ రంగస్వామి గౌడు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది రాజశేఖర్, హరిప్రసాద్, రంగస్వామి, గౌరి శంకర్ మంటలను అదుపు చేశారు. ఈ అదుపులో గురు రాఘవేంద్ర ఎలక్ట్రానిక్ షాపులో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. షాపు యజమాని వివరాల మేరకు షార్ట్ సర్క్యూట్‌తో షాపులోని వస్తువులు రూ.50లక్షలు, బిల్డింగ్ రూ.20 లక్షలు మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గోనెగండ్లలో రెండిళ్లలో చోరీ

గోనెగండ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో శనివారం పట్టపగలు రెండిళ్లలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. మొట్టి వీదిలోని పిసారి ఉస్మాన్ ఇంటి తలుపులకు ఉన్న తాళాలు పగల గొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువా ను పగల గొట్టి చోరీకి పాల్పడ్డారు. అలాగే మైనార్టీ కాలనీలో షాలి ఇంట్లో కూడా దొంగలు చొరబడ్డారు. బీరువాను పగల గొట్టి అందులో బంగారు, వెండి కోసం వెతికారు అలాగే ఇంట్లో అంతా వెతికారు. అక్కడ మేమి దొంగలకు విలువైన వస్తువులు దొరక్క పోవడం తో బీరువాలో ఉన్న దుస్తులను బయట పారవేసి దొంగలు పారిపోయారు. అయితే మొట్టి వీదిలోని పిసారి ఉస్మాన్ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోతమ బంధువుల ఇంట్లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం 12, ఒంటి గంట సమయంలో పిసారి ఉస్మాన్‌తో పాటు ఆయన భార్య, ఇంట్లో ఉన్న ఇతర కుటుంబ సభ్యులను ఉస్మాన్ కుమారుడు బాషా బస్టాండ్‌కు తీసుకువెళ్లి హైదరాబాద్‌కు వెళ్లే ప్రత్యేక వాహనంలో ఎక్కించి రెండు గంటలలోపు ఇంటి వచ్చాడు. అప్పటికే ఇంటి తలుపులు పగల గొట్టి ఉండటంతో బాషా ఇంట్లో వెళ్లి చూశారు. అప్పటికే బీరవాను పగలగొట్టి అందులో ఉన్న మూడు తులాల బంగారు, 50 తులాల వెండి, లక్ష రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. ఇంట్లో చోరీ జరిగట్లు తన తండ్రి పిసారి ఉస్మాన్‌కు ఫోన్ చేసి కుమారుడు తెలపడంతో వెనుతిరిగి గోనెగండ్లకు వచ్చారు. ఇంట్లో ఎంత బంగారు, వెండి, నగదు పోయిందో లెక్కలు వేసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే దొంగలు చాకచక్యంగా ఇంట్లోని నేల బండలపై నూనె పోసి వెళ్లారు. గంట వ్యవధిలో రెండు ఇండ్లలో చోరీకి దొంగలు ప్రయత్నించారు. బాధితుడు పిసారి ఉస్మాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.


మైనార్టీ కాలనీలో ఓ ఇంట్లో దొంగలు బీరువాను పగల గొట్టి దుస్తులను పారవేసిన దృశ్యం

4 ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం 4 మే 2025 ఆదివారం







37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకో వచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు'. 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్‌ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు...' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలని ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స



ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.

బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.



"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రెయిట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

నిరుద్యోగుల సమస్యలపై పోరాడాలి

పత్తికొండ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు సమస్యల పరిష్కారానికి పోరాడాలని సీపీఐ నాయకుడు భీమలింగప్ప పిలుపునిచ్చారు. శనివారం సీఆర్ భవన్ ంలో వ్యవస్థాపక దినోత్స వాన్ని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. నాయకులు ఆల్తాఫ్, మాజీ నాయకులు కారుమంచి పెద్ద వీరన్న, జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్, మోహన్, నజీర్, నవీన్, ఇమ్రాన్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలను తెలపండి



జాబితా విడుదల చేస్తున్న వ్యవసాయాధికారి

మద్దికెర, మే 3 (ఆంధ్రజ్యోతి): రబీలో పంట నష్ట రైతుల జాబితా నోటీసు బోర్డులో పెట్టామని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఏవో రవి తెలిపారు. శనివారం మండలంలోని ఆయా రైతుభరోసా కేంద్రాల్లో కరువు జాబితాను ప్రకటించారు. కరువు మండలంగా ప్రకటించడంతో శనగ, జొన్న రైతులకు మాత్రమే పరిహారం అందుతుందన్నారు. సిబ్బంది ఆనంద్, రాణి, జాకీర్, కవిత, తదితరులు ఉన్నారు.

ఆలూరు అభివృద్ధికి కృషి చేయండి

● కలెక్టర్‌కు జనసేన నాయకుడు వెంకప్ప వినతి

ఆలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ రంజిత్ బాషాను ఆలూరు జనసేన ఇన్‌చార్జి తెర్నెకల్ వెంకప్ప కోరారు. ఈమేరకు కర్నూలులో కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు వెంకప్ప తెలిపారు జలజీవన్, అమృతధార పథకాల ద్వారా గ్రామాల దాహార్తిని తీర్చాలని, రహదారులు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాలని కోరామన్నారు.



వినతి పత్రం ఇసున్న వెంకప్ప

గత వారం డిప్యూటీ సీఎం ఆఫీసు అధికారులతో విజయవాడలో సమావేశమై నియోజకవర్గానికి అవసరమైన బడ్జెట్ గురించి చర్చించినట్లు తెలిపారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే పందికోన రిజర్వాయర్ పూర్తి చేయడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చొరవ చూపి, రూ.250కోట్లు కేటాయించాలన్నారు.

అభివృద్ధి పనులపై సమావేశం

● ఇన్‌చార్జి చైర్మన్, కౌన్సిలర్లు, అధికారుల చర్చలు



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

ఆదోని టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధి పనులపై ఇన్‌చార్జి చైర్మన్ ముల్లా మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, అధికారులతో శనివారం సమావేశమయ్యారు. రహదారుల విస్తరణ, శుభ్రత, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల తదితర అంశాలపై అధికారులతో చర్చలు జరిపారు. ఇన్‌చార్జి చైర్మన్ గౌస్, వైస్ చైర్మన్ నరసింహాలు మాట్లాడుతూ పట్టణంలోని పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కౌన్సిలర్ల సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఏ వార్డులో సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొని రావాలని అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, సందీప్‌రెడ్డి, బాలాజీ యాదవ్, మొంబత్తి స్వామి, ఇంతియాజ్, కుస్మాన్, కిశోర్, చలపతి, ఇబ్రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తుగ్గలి, మే 3 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్సపొందున్న సుధాకర్(38) కర్నూలులో మృతి చెందాడు. వివరాల మేరకు.. మండలంలోని కడమ కుంట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లింగ మ్మ, హనుమంతు దంపతుల కుమా రుడు సుధాకర్ ఈ నెల 1వ తేదీన పొలం లోని బండరాళ్లను ట్రాక్టరులో వేసుకుని ఇంటికి తీసుకువస్తున్నాడు. మార్గమధ్యంలో ట్రాక్టర్ కొండి విరిగిపోయి ఇంజన్ సుధాకర్‌పై పడడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కర్నూలు గౌరి గోపాల్ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.



సుధాకర్ (ఫైల్)

సమ్మెను జయప్రదం చేయండి



అభివాదం చేస్తున్న కూలీలు

ఆదోని రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20వ చేయనున్న గ్రామీణ సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న కోరారు. శనివారం పాండవగల్లు గ్రామంలో కార్మికులతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరసనను జయప్రదం చేయాలన్నారు. కార్మికులకు నష్టం వాటిల్లే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉపాధి కూలీలకు 200రోజులు పనిదినాలను కల్పించాలని కోరారు.

రీసర్వేను పకడ్బందీగా చేయాలి

తుగ్గలి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండంలో రీసర్వేను పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. శనివారం కార్యాలయంలో వీఆర్వోలతో మాట్లాడుతూ మండలంలోని ముక్కెల్ల, పగిడిరాయి గ్రామాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా రీసర్వే చేయాలన్నారు. ఆర్ఐ వెంకట్రాముడు, వీఆర్వోలు కాశీ రంగస్వామి, నాగేంద్ర, రంగనాయకులు తదితరులు ఉన్నారు.

స్తంభాలు సరే.. తీగలు ఎక్కడ?



మద్దికెర, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు నుంచి మెయిన్ బజార్, పోలీస్ స్టేషన్ వరకు విద్యుత్ అధికారులు స్తంభాలను ఏర్పాటు చేశారు కానీ, వాటి తీగలు అమర్చలేదు. దీంతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. తమ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్య ఉందని కోరడంతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి నెల క్రితం స్థంబాలు పాతారని, అయితే తీగలు వేయలేదన్నారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ మాట్లాడుతూ పనులు పూర్తి చేసి తీగెలు ఏర్పాటు చేస్తామని వివరణ ఇచ్చారు.

కరెంటు తీగలు లేని స్తంభం

ఆదమరిస్తే అంతే!



పట్టణంలోని కోయనగర్ ఎస్సీ బాలికల హాస్టల్ ముందు ప్రధాన రహదారిలో గుంత ప్రమాదకరంగా మారింది. తాగునీటి పైపులైన్ కోసం గుంత తీసి పని అనంతరం పూడ్చకుండా అలాగే వదిలేశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో గుంత ఉండటంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాదం పొంచింది. ఇక రాత్రిళ్ల మరింత ప్రమాదం. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది

- ఆలూరు

భూసార పరీక్షలు చేయించండి

● జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న వరలక్ష్మి

వెల్దుర్తి, మే 3(ఆంధ్రజ్యోతి): రైతులు పొలానికి భూసార పరీక్షలు చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి సూచించారు. శనివారం మండలంలో కలగొట్ల రైతు సేవా కేంద్రంలో భూసార పరీక్షల ఆవశ్యకతపై రె అవగాహన కల్పించారు. భూసార పరీక్షలకు మే నెల సరైనదని, భూసారపరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడి పంటకు పోషకాలు అందించవచ్చునన్నారు. కౌలు రైతులకు 11 నెలల కాలపరిమితితో కౌలుకార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కౌలుకార్డుల పొందిన రైతులకు భూమిపై ఎలాంటి హక్కులు ఉండవన్నారు. రైతుసేవా కేంద్రంలో కౌలుకార్డులు పొందాలన్నారు. ఆహార,పోషకాహార భద్రత పథకం కింద రైతులకు 50శాతం రాయితీతో వేపనూనె, పురుగు మందులను, పిచికారీ యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, ఏవో అక్బర్ బాషా, సర్పంచ్ మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటలు సాగు చేయండి

రైతులు ఏక పంటలు వేయకుండా అంతర పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి సూచించారు. శనివారం గ్రామంలో పీఎండీఎస్ విత్తనాలు పంపిణీ చేశారు. ఎకరా పొలంలో పీఎండీఎస్ విత్తనాలు వేసుకొని కలియదున్నడం వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు తెలియజేశారు. ఏక పంట వేయకుండా అంతరపంటలు, సరిహద్దు పంటలు, ఎర పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేయాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గిం చాలని తెలిపారు. గ్రామానికి చెందిన రైతు పరమేశ్వరుడు అర ఎకరంలో బీజామృతంతో శుద్ధిచేసిన 32 రకాల పీఎండీఎస్ విత్తనాలను జిల్లా వ్యవసాయాధికారి సమక్షంలో పొలంలో వేశారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, ఏవో అక్బర్‌బాషా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జనార్ధన్, పరమేశ్వరుడు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవుల మృతి

ఆదోని రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంలో రెండు ఆవులు మృత్యు వాత పడ్డాయి. వివరా లమేరకు.. ఉరుములు, మెరుపులతో గాలివాన కురియడంతో పొలాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. ఉదయం ఆవులను మేపడానికి రైతు వెళ్ళిన రైతు ప్రహ్లాదకు విద్యుత్ వైర్లు తగిలి రెండు ఆవులు, పొటేలు మృతి చెంది ఉండటాన్ని గమనించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.



మృతిచెందిన ఆవులు

శ్మశానంలో ముళ్లకంప తొలగించండి



మాట్లాడుతున్న పంచాయతీ సభ్యులు

మద్దికెర, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రంగమ్మ కుంట సమీపాన శ్మశానంలో ముళ్లకంప తొలగించి బాగు చేయాలని పంచాయతీ సభ్యులు కోరారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పంచాయతీ సభ్యులు కవిరెడ్డి కృష్ణ, రామాంజులు మాట్లాడుతూ శ్మశానంలో ముళ్లకంప ఉందని, దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాయినగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్‌కు వదిలిన36 సెంట్ల స్థలాన్ని కొందరు ఆక్రమించాలని, పంచాయతీ వారు అనుమతి ఇవ్వరాదన్నారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ వెంటనే ఎక్సవేటర్‌తో ముళ్లకంప తొలగిస్తామని, పైపులైన్ పనులు పూర్తి చేస్తామన్నారు. పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు బండారు ఆంజనేయులు, పంచాయతీ సభ్యులు లక్ష్మినారాయణ, జంబునాథ్ రాయుడు, బాలచంద్ర తదితరులు ఉన్నారు.

శాంతి హోమాలు

మద్దికెర, మే 3 (ఆంధ్రజ్యోతి): మద్దమ్మకుంట సమీపంలో వెలసిన సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో నిర్వహకుడు విజయప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో శాంతి హోమాలు నిర్వహించారు. శనివారం మూలవిరాట్ సుబ్రహ్మణ్యస్వామికి పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పురోహితుల ఆధ్వర్యంలో రాహుకేతు దారణ, ఆరోగ్య సంతాన సౌభాగ్యంపై హోమాలు పూజలు చేశారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి



కేక్ కట్ చేస్తున్న మీనాక్షినాయుడు

చిప్పగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేస్తోదని జడ్పీటీసీ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఏరూరు మీనాక్షినాయుడు అన్నారు. శనివారం జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు కేకు కట్ చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, జనార్దన్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే క్యాంబాబు సహకారంతో ఆలూరు అభివృద్ధి చెందుతోందన్నారు. చిప్పగిరి మండలంలో రూ.4 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాలువలను నిర్మించామన్నారు. 50 గోకులం షెడ్లను నిర్మించామని వివరించారు. ఈ కార్యక్రమంలో బెల్డోణ వెంకటేశు, నరసింహులు, రామచంద్ర, సీనప్ప, హరికృష్ణ, సర్పంచ్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన కల్పించాలి

జూన్ 10 వరకు కార్యక్రమాలు
- సీడీపీవో లలిత

మద్దికెర, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని సీడీపీవో లలిత సూచించారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసం, వేసవి సెలవులపై అవగాహన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో జూన్ 10వ తేదీ వరకు రోజూ ఒక అంశంపై అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి ఉన్నారు.

కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు

దేవనకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని త్వుదొడ్డి గ్రామంలో శనివారం కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో కాశిరెడ్డినాయన ప్రభను ఊరేగించారు. వారోత్సవాల్లో భాగంగా గిరకబండి పోటీలు నిర్వహించారు. గుడికల్లు రంగయ్య వృషబాలు విజేతగా, హనుమాపురం గోవిందప్ప వృషబాలు రెండో విజేతగా, గుడికల్లు ఆకుల మంగయ్య వృషభాలు మూడో విజేతలుగా నిలిచాయి.

ధోబీ ఘాట్లను అభివృద్ధి చేయాలి

● రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సావిత్రి

ఆదోని టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధోబీ ఘాట్లను అభివృద్ధి చేయాలని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి కోరారు. ఈ మేరకు శనివారం సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని బాలేకులలోని రెండో ధోబీ ఘాట్‌ను రజకులు 90 ఏళ్లుగా వినియోగించుకుంటున్నారని, అయితే ఈ ప్రాంతంలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడం విచారకరమన్నారు. అలాగే శాంతమల్లప్ప కొండ ప్రాంతంలోని ధోబీ ఘాట్‌లోనూ సౌకర్యాలు కల్పించకపోవడంతో రజకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రజకులకు అవసరమైన షెల్టర్లు, షెడ్లను, కట్టలను నీటి కుంటలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోవిందప్ప, రవి, తదితరులు పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి

హాలహర్వి, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్నేహభావంతో మెలగాలని ఎస్ఐ చంద్ర సూచించారు. మండలంలోని గూళ్యం గ్రామంలో ఇరు వర్గాల నాయకులతో మాట్లాడారు. అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన సూచించారు.

యువత ఉద్యమించాలి



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న కార్యకర్తలు

దేవనకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమిం చాలని ఏఐవైఎఫ్ మాజీ నాయకులు నర్సా రావ్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ 66వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. భవిష్యత్ కోసం ప్రభుత్వాలపై ఉద్యమాలతో ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు రవి కుమార్, సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు, శేకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగించండి

హాలహర్వి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీ నిడిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విజృంభించి రోగాల పాలవుతున్నా మంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పారిశుధ్య పనులు చేయడం లేదు. ఇప్పటికైనా స్పందించి, పారిశుధ్య పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



హాలహర్వి గ్రామం డ్రైనేజీలో మురుగు

మహిళలకు శిక్షణ తరగతులు



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఆదోని టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్టోరియాపేట అంగన్‌వాడి కేంద్రం-2లో శనివారం సూపర్‌వైజర్ స్వయంప్రభ ఆధ్వర్యంలో బాలికల వికాసం శిక్షణ తరగతులు నిర్వహించారు. జీవన నైపుణ్యాలను పెంచు కునే విధానాలపై బాలికలు, మహిళలకు అవగాహన కల్పించారు. మహిళల్లో నైపుణ్యాన్ని వెలికి తీసుకువచ్చేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని సూపర్‌వైజర్ తెలిపారు. అనంతరం మహిళల సందేహాలకు పరిష్కార మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ దివ్య, అంగన్వాడీ కార్యకర్తలు ఈరమ్మ, శారద, నాగరాత్న, ఎఎన్ఎం శంకరమ్మ, ఆశావర్కర్లు ధనలక్ష్మి, త్రివేణి, సిబ్బంది తాయమ్మ, లక్ష్మి, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

తుగ్గలి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం నాయకుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం సచివాలయం వద్ద ఆందోళన చేసి, సిఇబ్బందికి వినతి పత్రం అందజేశారు. వారం నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పనులు కల్పించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.



వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు శ్రీరాములు, ఉపాధి కూలీలు

కన్నీటి వీడ్కోలు..

● రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి
● సంతాపం తెలిపిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్



సంతాపం తెలుపుతున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలానికి వెళ్లి ఆత్మకూరు మండలం బైర్లూటి వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలు శనివారం ఆదోనికి చేరాయి. పట్టణంలోని రాజీవ్ గాంధీనగర్, ఇందిరా నగర్, రాయచోటి సుబ్బయ్య కాలనీకి చెందిన వారు మరణించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో రాజీవ్ గాంధీ నగర్, రాయచోటి సుబ్బయ్య కాలనీకి చెందిన లక్ష్మి (28), తోడికోడలు చంద్రమ్మ (42), ఇందిరానగర్‌కి చెందిన గిడ్డయ్య (42) మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహా లను చూసి బంధువులు కాలనీవాసుల రోదనలతో ఆ ప్రాంతమంతా శోక సంద్రంలో మునిగింది. గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నవారి కన్నీటిని ఎవరూ ఆపలేకపోయారు. శశికళ(38) మృతదేహాన్ని ఎమ్మిగనూరు మండలంలోని డి బెలగల్ స్వగ్రామానికి తీసుకెళ్లగా 15 ఏళ్ల యువకుడు కుమార్ మృతదేహాన్ని ఎమ్మిగనూరు మండలం లోని సొంత గ్రామానికి తరలించారు. కాగా మృతదేహాలకు సబ్ కలెక్టర్ మౌర్య బరధ్వాజ్, ఎమ్మెల్యే పీపీ పార్థసారథి నివాళి అర్పించారు. అనంతరం బాధితులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఘనంగా ఏఐవైఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పెద్దకడుబూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ తాలుకా అధ్యక్షుడు జాఫర్ పటేల్ ఆధ్వర్యంలో సంఘం 66వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ నాయకుడు వీరేష్, మబ్బు ఆంజినేయ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి కల్పిస్తామని మాయ మాటాలు చెప్పి గద్దెనెక్కి, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత నట్టేట ముంచాయన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మహమ్మద్ హుస్సేన్, భాష, రాజా, రియాజ్, గోపాల్, తిక్కన్న, గిడ్డయ్య, గోపాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమరేశ

కౌతాళం, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అమరేశ తెలిపారు. కౌతాళం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఈ సమావేశానికి హజరై తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అంతకు ముందు కాశ్మీర్ ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమరేశ మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరిగిందని చాల గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ప్రకాశం, పంచాయతీ కార్యదర్శులు యోగేశ్వరరెడ్డి, ఎంపీపీ అమరేశ, వైస్ ఎంపీపీలు లిఖిత రెడ్డి, బుజ్జిస్వామి, మండల కోఆప్షన్ మెంబరు మాబుసాబ్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముగతిలో రీ సర్వే



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో శనివారం తహసీల్ధారు శ్రీనివాసులు రీ సర్వే నిర్వహించారు. గ్రామంలో ప్రతి రైతుకు ముందుగానే నోటీసులు జారీ చేసి పోలాల రీ సర్వేకు వచ్చారు. అలాగే ఇబ్బందులు ఉన్న రికార్డులను తహసీల్ధారు పరిశీలించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చూస్తానని రైతులకు చెప్పారు. ఎవరికైన చిన్న చిన్న ఇబ్బందులు ఉన్న సర్దుబాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ మహేష్, సర్వేయర్ శేఖర్, వీఆర్వో రాఘువేంద్ర, పాల్గొన్నారు.

'లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'

ఎమ్మిగనూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్)ప్రతిఘటన (ఐఎఫ్‌టీయూ పీవైఎల్) జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ కోరారు. కార్మికులు సాధించుకున్న నాలుగు చట్టాలకు సవరణ చేసి పెట్టుబడిదారులకు కోట్లు దోచిపెడుతూ కార్మికులను బిచ్చగాళ్ళుగా తయారు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం కనుసనల్లో పని చేస్తూ కార్మిక వర్గానికి న్యాయం చేయడం లేదన్నారు. జిల్లాలో మూత పడిన పరిశ్రమలు తెరిపించాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సల్మాన్, పృధ్విరాజ్ ,రాముడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇక్కట్లు తీరేదెలా...?

● హెచ్. కైరవాడి దగ్గర అడుగంటిన హంద్రీ నది ● ఇసుక అక్రమ తరలింపుతో దుస్థితి

గోనెగండ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): హంద్రీనది పరివాహక గ్రామమైన హెచ్ కైరవాడిలో కొంత కాలంగా తాగునీటి ఇక్కట్లు తీవ్రమయ్యాయి. హంద్రీనదిలో నీరు లేక ముళ్ల పొదలతో నిండిపోయింది. దీనికి తోడు అక్రమంగా కొందరు తమ స్వార్థం కోసం ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో హెచ్. కైరవాడి, గ్రామంలో తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. హెచ్ కైరవాడి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రం కావడంతో గ్రామానికి చెందిన మహిళలు ఆదోని డీఎల్‌పీవో నూర్జహాన్‌కు తాగునీటి సమస్య పరిష్కరించాలని బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 9000 జనాభా ఉన్నారు. 14 బోర్లు, 2 పీడబ్ల్యూ, 3ఎంపీడబ్ల్యూఎస్ స్కీంలు ఉన్నాయి. అయితే వేసవి కాలం కావడంతో బోర్లు అరకొరగానే నీటిని అందిస్తున్నాయి. బోర్ల నీరు గ్రామప్రజలకు ఎంతమాత్రం సరిపోవడం లేదు. అయితే హంద్రీ గ్రామాలకు తాగునీరు అందించేందుకు అధికారులు హంద్రీ నదిలో బోర్లు వేశారు. అయితే భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బోర్ల మోటర్లకు నీరు అందడంలేదు. దీంతో గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు గ్రామ శివార్లలోని బోరు, బావులు నుంచి ద్విచక్రవాహనాలపై నీటిని తీసుకు వస్తున్నారు. కొందరు అక్రమార్కులు రాత్రిపగలు అనే తేడా లేకుండా ఇసుకను అక్రమంగా హంద్రీ నది నుంచి ఇసుక తరలిస్తుండటంతో హంద్రీ పరివాహక గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయని ప్రజలు వాపోతున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నప్పటికి సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. హంద్రీనదికి గాజులదిన్నె ప్రాజెక్టు నీరు విడుదల చేస్తే భూగర్భజలాలు పెరిగి తాగునీటి బోర్లకు నీరు అందుతుందని దీంతో కొంత నీటి సమస్య తీరుతుందని ప్రజలు తెలుపుతున్నారు.



హెచ్.కైరవాడిలో కొళాయి దగ్గర గుమికూడిన జనం

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

హెచ్ కైరవాడి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. హంద్రీనదిలో వేసిన బోర్లు ఎండిపోయాయి. దీంతో మోటార్లకు నీరు అందడం లేదు. అధికారులు స్పందించి హంద్రీ పరిసర గ్రామాలలోని తాగు నీటి సమస్యను పరిష్కరించాలి.

రాజేష్, హెచ్. కైరవాడి.

అదుపు తప్పితే అంతే



ట్రాక్టర్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న రైతులు

మంత్రాలయం, మే 3 (ఆంధ్రజ్యోతి) :పశుగ్రాసం ఇంటికి తెచ్చుకునేందుకు రైతులు ట్రాక్టర్లపై ప్రమాదకర స్థాయిలో ప్రయాణాలు చేస్తూ గమ్యాలకు చేరుకుంటున్నారు. ప్రయాణిస్తూ అదుపు తప్పితే అంతే సంగతులే. కర్ణాటక నుంచి మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు పశుగ్రాసాన్ని ట్రాక్టర్ల సాయంతో నిరంతరం రవాణా చేస్తున్నారు. దీనికి తోడు బరువుకు మించిన గ్రాసాన్ని లోడింగ్ చేసి పైన రైతులు కూర్చుని ప్రమాదకరస్థాయిలో ప్రయాణాలు చేస్తున్నారు. విద్యుత్ వైర్లను తాకుతున్నా తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడుతున్నారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే రైతుల ప్రాణాలకు ఇబ్బందే. పోలీసులు, అధికారులు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు వాపోతున్నారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, ఇంటి స్థలం లేని వారు ఇంటిస్థలం కోసం స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇండ్లు లేని వారికి స్థలం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఇళ్లు లేని వారు, ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందని వారు, నివాస స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గోనెగండ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని ఫంక్షన్ హాల్లో శనివారం 1999-2000లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా జరిగింది. పాతికేళ్ల తరువాత కలవడంతో కొందరు ఉద్వేగానికి లోనయ్యారు. అలనాటి ఉపాధ్యాయులు వెంకటరమణ, రామచంద్ర, మాధవస్వామి, కృష్ణయ్య, రాఘవరెడ్డి, రాజేశ్వరి, అక్బర్, అన్వర్‌బాషా హాజరయ్యారు. ఉపాధ్యాయులను విద్యార్థులను శాలువ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అంతకు ముందు పాఠశాల నుంచి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జిక్రియా, షేక్షావలి, గొరవ మునెప్ప, సత్యనారాయణశెట్టి, రామకృష్ణ, గానుగబాషా, ఓబన్న, అనురాధ, చంద్రకళ, సౌజన్య, లక్ష్మి, కృష్ణా, అజుమ్మత్, మహాలక్ష్మి, సీతమ్మ, జయమ్మ, ఖాసీం, రాజేష్, కృష్ణ పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు వాల్మీకుల అండ



మాట్లాడుతున్న లక్ష్మన్న

మంత్రాలయం, మే 3 (ఆంధ్ర జ్యోతి):రాష్ట్రంలోని 50 లక్షల మంది బోయ, వాల్మీకి ఓటర్లందరూ జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అండగా ఉంటామని మంత్రాలయం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, వాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మన్న అన్నారు. 40 ఏళ్లుగా ఎస్టీ జాబితాలో చేర్చాలని పోరాటం చేస్తున్నామన్నారు. అసెంబ్లీలో పాస్ చేసిన ఎస్టీ బిల్లును కేంద్రంలో పాస్ చేయిస్తే పవన్ కళ్యాణ్‌కు 50 లక్షల మంది వాల్మీకుల ఓటర్లు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు బీవీ రవిచంద్ర, రఘు, వరప్రసాద్, రాఘవేంద్ర, వన్నూరి, వెంకటేశ్, రఘు, గిడ్డయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఏం ఏర్పాటు చేయాలి

నందవరం మే 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరం కెనరా బ్యాంక్ దగ్గర ఏటీఏంను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు గువ్వల నారాయణ డిమాండ్ చేశారు. శనివారం బ్యాంక్ మేనేజర్ నాగరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఏటీఎం లేకపోవడంతో ప్రజలు, రైతులు డబ్బులు డ్రా చేసుకునేందకు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ బ్యాంక్ పరిధిలో దాదాపు 8 గ్రామాలు ఉన్నాయని వీటిని దృషిలో ఉంచుకుని బ్యాంక్ మేనేజర్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఏటిఏం ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు రాజశేఖర్, తిమ్మప్ప, బీమయ్య పాల్గొన్నారు.

డిగ్రీలో విభిన్న కోర్సులు అభినందనీయం



మాట్లాడుతున్న పట్టణ సీఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : వైష్ణవి డిగ్రీ కళాశాలలో మెడికల్ కోడింగ్, సైబర్ క్రైమ్ కోర్సులు ఉండడం అభినందనీయమని పట్టణ సీఐ శ్రీనివాసులు అన్నారు. కళాశాలలో జరిగిన ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో ముఖ్య అతిధులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ శిల్పా, డాక్టర్ మనోజ్, సీఐ పాల్గొని సైబర్ క్రైమ్, మెడికల్ కోడింగ్‌పై మూడు నెలల శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లు అందజేశారు. వైష్ణవి కళాశాల ఛైర్మన్ గడిగే లింగప్ప మాట్లాడుతూ చదువుతో పాటు ఉపాధి కోర్సులు కూడా అవసరమని మంచి భవిష్యత్తు కోసం యాజమాన్యం తీసుకొచ్చిన కోర్సులలో విద్యార్థులు తమ ప్రతిభను చాటాలన్నారు. సోషల్ మీడియా ఎంత అవసరమో అంతే ఉపయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో సుధీర్, కూమారస్వామి, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

మంత్రాలయం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలం లోని రచ్చమర్రి గ్రామానికి చెందిన బోయ నరసింహలు, కోసిగమ్మల కూతురు (17) అదృశ్యం అయినట్లు మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు. ఈనెల 2వ తేదీన శక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి మళ్లీ ఇంటికి రాకపోవడంతో కూతురు కోసం బంధువులు, పరిచయస్తుల వద్ద విచారించారు. ఆచూకీ లభ్యం కాకపోవటంతో తల్లిదండ్రులు నరసింహులు, కోసిగమ్మలు శనివారం మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వీరేష్ తెలిపారు.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ముందు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. శనివారం సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు ఆధ్వర్యంలో 139వ మే డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శైలజ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చికాగో నగరంలో 1886లో శ్రామిక మహిళా కార్మికుల ఆధ్వర్యంలో ఎనిమిది గంటల పనిదినాలను సాధించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఎమ్మిగనూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగుచూశాయి. రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాలమేరకు.. పట్టణంలోని 1, 5, 6, 3 రేషన్ దుకాణాల్లో జిల్లా విజిలెన్స్ ఎస్ఐ నరేంద్ర భూపతి, ఏఈఈ శ్రీనివాసరావుతో పాటు ఎమ్మిగనూరు రెవిన్యూ అధికారుల సమక్షంలో ఆయా రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకుల వివరాలు, నిలువలు పరిశీలించారు. 1వ రేషన్ దుకాణంలో 37 క్వింటాళ్ల బియ్యం, 57 కేజీల చెక్కర డీలరు దుకాణంలో నిలువ ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఐదో దుకాణంలో ఈనెలకు సంబంధించిన నిత్యావసర సరుకులు ఎండీ ఆపరేటర్‌కు మొత్తం స్టాక్ డెలివరీ చేసినట్లు మిషన్‌లో చూపించారు. అయితే సరుకులు మాత్రం డీలర్ దగ్గర నిలువ ఉన్నాయి. అలాగే 6వ దుకాణంలో 8ప్యాకెట్ల చెక్కర నిలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే మునెప్ప నగర్‌లోని మూడో రేషన్ దుకాణంలో తనిఖీలు చేసేందుకు విజిలెన్స్ అధికారులు వెళ్లగా అప్పటికే దుకాణం తాళం వేసి ఉంది. డీలర్‌ను రప్పించేందుకు అధికారులు ప్రయత్నించగా ఆయన సెల్ బంద్ ఉండటంతో పాటు అందుబాటులోకి రాలేదు. దీంతో కొద్ది సేపు వేచి చూసిన అధికారులు చేసేది లేక దుకాణాన్ని సీజ్ చేసి నోటుసు అతికించి వెళ్లిపోయారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా రేషన్ దుకాణాల్లో సరుకులు నిల్వ ఉన్న డీలర్లపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఎస్ డీటీ మహేష్, వీఆర్వో మోహన్, లింగేష్‌లు పాల్గొన్నారు.



పట్టణంలోని మునెప్పనగర్‌లో ఎఫ్‌పీ దుకాణాన్ని సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 3(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరించారు. శనివారం వైశాఖ షష్టి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆశీస్సులతో రాఘవ్రేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల బంగారు రథం పై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి పండితులు హారతులు ఇచ్చిన అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగా వైభవంగా ఊరేగించారు.

సుత్తూరు మఠాధిపతికి ఘన సన్మానం :

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కర్ణాటకలోని సుత్తూరు మఠం పీఠాధిపతి శివరాత్రి దేసీకేంద్ర స్వామీజీని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఘనంగా సత్కరించారు. శనివారం ధార్మిక పర్యటనలో భాగంగా మైసూరు సమీపంలో ఉన్న సుత్తూరు మఠాన్ని, నంజనగూడ అక్కడున్న భక్తులకు ఇరువురు పీఠాధిపతులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో గౌతమాచార్, సుజీంద్రాచార్, రాజా ఎస్ అప్రమేయాచార్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాషాచార్, వరదేంద్రాచార్, భక్తులు పాల్గొన్నారు.



సుత్తూరు మఠం పీఠాధిపతి శివరాత్రి దేసీకేంద్ర స్వామీజీని సన్మానిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

● మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం మార్మోగింది. శని, ఆదివారం సెలవు దినాలు కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది.

పాఠశాల ప్రహరీని కూల్చిన వైసీపీ నాయకుడు

పెద్దకడుబూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బసవన్నకట్ట కట్టేందుకు పాఠశాల ప్రహరీని పడగొట్టాడు. విద్యాశాఖ అధికారుల అనుమతి తీసుకోకుండ ఇష్టానుసారంగా పాఠశాల ప్రహరీని కూల్చడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈవో రాంమూర్తిని వివరణ కోరగా జరిగిన విషయం వాస్తవమేనని ప్రహరీని మళ్లీ నిర్మిస్తామని చెప్పారన్నారు.



కూల్చేసిన పాఠశాల ప్రహరీ

డంపు.. కంపు!

● రహదారిని కమ్మేస్తున్న డంపు యార్డు పొగ
● ఇబ్బందుల్లో వాహనదారులు
● పట్టించుకోని అధికారులు

ఎమ్మిగనూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ శివారులోని సోగనూరు రోడ్డులో ఉన్న డంపు యార్డు నుంచి వెలువడుత్ను పొగ రహదారిని కమ్మేస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివారులోని సోగనూరు రోడ్డులో గత కొన్నేళ్ల క్రిత్రం మున్సిపాలిటి డంపు యార్డును ఏర్పాటు చేసింది. అప్పటినుంచి ఇప్పటి వరకు పట్టణంలోని చెత్త చెదారాన్ని డంపు యార్డుకు తరలిస్తున్నారు. అయితే ఎప్పటి చెత్తను అప్పుడు శుద్ధి చేయకపోవటంతో డంపు యార్డులో భారీగా చెత్త పేరుకుపోయింది. ఈ చెత్తకు నిప్పు అంటుకోవటంతో నిత్యం కాలుతూ పొగ వస్తుంది. ఈ పొగ కాస్త గాలి ఎటువైపు వీస్తే అటు వైపు వెళ్తుండటంతో అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రం సైతం డంపు యార్డునుంచి వెలువడుతున్న పొగ సోగనూరు రోడ్డును కమ్మేయడంతో పట్టణం, సోగనూరు నుంచి ద్విచక్రాలపై రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ప డ్డారు. పొగ వల్ల రహదారిపై ఎదురుగా ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి. అంతేగాక డంపు యార్డునుంచి వెలువడే పొగ పీల్చడంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపు యార్డు నుంచి పొగ రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కనిపించని సోగనూరు రోడ్డు



పట్టణ శివారులోని సోగనూరు రోడ్డును కమ్మేసిన డంపు యార్డు నుంచి వస్తున్న పొగ



సోగనూరు రోడ్డు పక్కన ఉన్న డంపు యార్డు